ఉపాధ్యాయుల బదిలీల నిబంధనలు మార్చాలి : యుటిఎఫ్

పార్వతీపురం : గిరిజన సంక్షేమ శాఖ లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల నిబంధనలు మార్చాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు డిమాండ్ చేశారు.సోమవారం ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరావుతో కలిసి ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 22 ప్రకారం ప్రభుత్వ, జెడ్‌పి, మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీల నిబంధనలు రూపొందించారని చెప్పారు. ఈ నిబంధనల ప్రకారం మినిమం సర్వీస్ 2 ఏళ్ళు, హైస్కూల్ హెచ్‌ఎంలకు ఐదేళ్ళు, ఎస్‌జిటిలకు, సీనియర్ అసిస్టెంట్లకు 8 ఏళ్ళు ఉండాలని పేర్కొన్నట్లు తెలిపారు. అయితే గిరిజన సంక్షేమ శాఖలో హెచ్ ఎంలకు, ఎస్‌జిటిలకు, సీనియర్ అసిస్టెంట్లకు ఐదేళ్ల సర్వీస్ గా నిర్ణయించడం సరికాదన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో కూడా హెచ్‌ఎంలకు ఐదేళ్ళు, ఎస్‌జిటిలకు, సీనియర్ అసిస్టెంట్లకు 8 ఏళ్ళ సర్వీసు నిబంధన అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మాకు దారి చూపండి

70ఏళ్లయినా అభివృద్ధికి నోచని మన్యం రోడ్లు
యువత శ్రమదానంతో పనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇంకా ఎన్నేళ్లు ఈ కష్టాలు, కనీస అవసరాలు మెరుగుపడక అభివృద్ధికి దూరంగా ఉన్నాం. ఎన్నో ప్రభుత్వాలు, పాలకులు మారినా, అధికారులు వచ్చి పోతున్నా మా బాధలు పట్టించు కొనేవారే లేరు. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా మా జీవితాల్లో వెలుగులు నిండలేదు. ఎవరో వస్తారని... ఏదో చేస్తారని ఎదురు చూసి చూసి విసిగిపోయారు. దారి చూపేవారు లేక తమ దారి తామే వేసుకున్నారు. యువత, మహిళలు కలిసికట్టుగా శ్రమదానం, సొంత నిధులతో రోడ్డు పనులు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే...

మండలంలోని చాపరాయి బిన్నిడి పంచాయతీ మూల బిన్నిడి నుండి కొండ బిన్నిడి గ్రామానికి శ్రమదానంతో యువత రహదారి పనులు ప్రారంభించారు. తమ గ్రామం వైపు ఏ ఒక్కరూ కన్నెత్తి చూడలేదని, ఎన్నో ఏళ్లుగా కష్టాలు పడుతూ, భరిస్తూ వచ్చామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి రోడ్డు మార్గం లేక విద్య, వైద్యం, తాగునీరు మౌలిక వసతులు లేక నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు. యువతలో చైతన్య స్ఫూర్తి రావడంతో కొంత సొంత నిధులు పోగుచేసి, శ్రమదానంతో సోమవారం రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి తమ గ్రామానికి రోడ్డు వేసి రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని యూత్ ప్రెసిడెంట్ పి శ్రీను కోరారు.

సొంత నిధులు తో రోడ్డు పనులు చేపడుతున్న కొండ బిన్నిడి యువత

రోడ్డును బాగు చదును చేసుకుంటున్న చిన రావికోన గిరిజనులు

రోడ్డు వేయాలంటూ వేడుకలు

తమ గ్రామానికి రోడ్డు వేయాలని రాయగడ జమ్మూ పంచాయతీ చినరావికోన గిరిజనులు వేడుకుంటున్నారు. ఈ గ్రామానికి గత కొన్నేళ్లుగా రోడ్డు అభివృద్ధికి నోచుకోకపోవడంతో గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాముల గీశాడ ప్రధాన రహదారి నుంచి చినరావికోన గ్రామానికి మూడు కిలోమీటర్ల ఉన్న రహదారి పూర్తిగా రాళ్లు తేలి అధ్వానంగా మారింది. వర్షాకాలం వచ్చిందంటే చాలు కొండపైన ఉన్న గిరిజనులు కిందికి రావడానికి నానా తంటాలు పడుతున్నారు. ఈ గ్రామంలో 300 వరకు జనాభా కలిగి ఉన్నారు. వివిధ పనుల నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని గిరిజనులు తెలిపారు. సోమవారం గ్రామస్తులు అంతా ఏకమై శ్రమ దానంతో రోడ్డును చదును చేసుకున్నారు. ఐటిడిఎ అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

పనులు ప్రారంభమైనా తప్పని చింత

మరో వైపు లంబేసు పంచాయతీ లప్పటి నుండి వాడబాయి వరకు సుమారు 2 కిలోమీటర్లు రహదారి పనులను మహిళాలు కొండను తవ్వి మట్టి పనులను చేపడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి రూ.2.80 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. 20రోజులుగా పనులు నిలిచిపోవడం తో గ్రామస్తులే స్వయంగా పనులు చేస్తున్నారు.

11వేల మందికి సిసిఆర్ కార్డులు : కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురం

కౌలు రైతులకు రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధ శాఖలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 11 వేల మందికి సిసిఆర్ కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా ఉందన్నారు. గత ఏడాది 9,500 వరకు కార్డులు జారీ అయ్యాయని తెలిపారు. కౌలు రైతులను గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు నిర్ధారించాలని ఆయన ఆదేశించారు. సిసిఆర్ కార్డులు జారీ అనంతరం రుణాలు అందించాలని అయన పేర్కొన్నారు. నిబంధనలు పాటిస్తూ వాస్తవ లబ్ధిదారులకు రుణాలు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. అవసరమైతే జాయింట్ లయబుల్ గ్రూప్ లు (జె ఎల్ జి) ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం రేషన్ కార్డులు జారీకి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందేనని, 21 రోజుల్లో సంబంధిత విచారణ పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సీతంపేట, మక్కువ తదితర మండలాల్లో ఎక్కువగా పెండింగ్ లో ఉన్నాయని, తక్షణం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పక్కన జెసి, డిఆర్ఒ

అన్నదాత సుఖీభవకు ఆధార్ అనుసంధానం కావాలి

జూన్ 1వ తేదీ నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న అన్నదాత సుఖీభవకు రైతుల ఆధార్ అనుసంధానం కావాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. వెబ్ ల్యాండ్ లో ఉన్న ప్రతి ఒక్కరి ఆధార్ అనుసంధానం కావాలని అన్నారు. రైతు న్యాయ పరంగా వాస్తవ లబ్ధిదారుగా ఉండాలని ఆయన ఆదేశించారు. వాస్తవంగా పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉండి వెబ్ ల్యాండ్ లో వివరాలు నమోదు కాకపోవడం, లేదా వివరాలు సక్రమంగా లేకపోవడం వంటి అంశాలు ఉండే అవకాశాలు ఉంటాయని వాటిని తక్షణం పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

విఆర్ఒలు ప్రధాన కేంద్రాల్లో ఉండాలి

జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు ప్రధాన కేంద్రాల్లో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు తక్షణం అప్రమత్తం చేయాలని, సమాచారాన్ని జిల్లా కేంద్రానికి వెంటనే అందించాలని అయన స్పష్టం చేశారు. ప్రధాన కేంద్రాల్లో ఉంటూ రేషన్ కార్డులు జారీ, సిసిఆర్ సి జారీ, ఆధార్ అనుసంధానం వంటి అంశాలను పర్యవేక్షణ చేయాలని ఆయన అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు పాలకొండ సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె. హేమలత తగితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జూన్ 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో సంబంధిత హెచ్‌ఎంలు, వార్డెన్లు, కుక్‌లు విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కురుపాం జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోసెఫ్ సూచించారు. మండలంలోని గల పలు ఆశ్రమ పాఠశాలలకు సోమవారం ఆమె వెళ్లి వంటగదులు, తాగునీటి వద్ద పరిసరాల పరిశుభ్రత ఎలా ఉందోనని పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత పాఠశాలల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, ఎల్విన్‌పేట ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్, కోర్టు పిసి పోలిరాజు, మండల న్యాయ సేవా సమితి సిబ్బంది పాలకొల్లు శ్రీనివాసరావు, కోర్ట్ సిబ్బంది మంగరాజు ఉన్నారు.

పిజిఆర్ఎస్ దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - సీతంపేట

పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారు లను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే దరఖాస్తుదారుల సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలన్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పిజిఆర్ఎస్‌కు 135 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో సీతంపేట ఐటిడిఎ ఎపిఒ సిహెచ్ చినబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ రమాదేవి, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కలెక్టరేట్‌లో...

పిజిఆర్ఎస్ విభాగానికి ప్రజల నుంచి వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ సి డిప్యూటీ కలెక్టర్ పి ధర్మచంద్రారెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమావేశంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల నగదు బదిలీకి
5లోగా ఆధార్‌కు అనుసంధానం కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సంక్షేమ పథకాల నగదు బదిలీకి ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్‌ను అనుసంధానం చేయాలని పార్వతీపురం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ రెడ్డి బాబురావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌పిసిఐకు అనుసంధానం తప్పనిసరి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న, చేయనున్న సంక్షేమ పథకాల నగదు నేరుగా బ్యాంక్ ఖాతాకు జమ చేసేందుకు ఎన్‌పిసిఐ మ్యాపర్‌లో ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో సుమారు 51 లక్షల మందికి బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ లేని కారణంగా గత ఏడాది గ్రామ, వార్డు సచివాలయ విభాగం, పోస్టల్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొంత పురోగతి సాధించినట్టు తెలిపారు. అయితే ఇంకా లబ్ధిదారుల్లో చాలా మందికి ఆధార్ అనుసంధానం కాలేదని, ఈ నేపథ్యంలో పోస్టల్ డిపార్ట్మెంట్ సచివాలయ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5 లోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్ పిసిఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేయడం ద్వారా సంక్షేమ పథక ఫలితాలు ఇబ్బందుల్లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఆధార్ సీడింగ్ జరిగితే ఐపిపిబి ఖాతాలో జమైన పథకాల నగదును ఏ పోస్ట్ ఆఫీస్‌లో అయినా తీసుకునే సదుపాయంతో పాటు ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌లకు లింక్ చేసుకుని ఆన్లైన్ ట్రాన్సాక్షన్స్ -NEFT, IMPS, UPI కూడా చేసుకునే సౌకర్యం ఉందని వివరించారు. ఆధార్ సీడింగ్ (ఎన్‌పిసిఐ మ్యాపింగ్) ఇంకా పూర్తి చేయని వారు వెంటనే తమ దగ్గరలోని పోస్టు ఆఫీసును సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలకు సిద్ధంగా ఐపిపిబి అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని ఆయన కోరారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
కలెక్టరేట్ ఎదుట స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపివేయాలని, తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు అత్యంత ముఖ్యమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి, ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర ద్రోహం చేసేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం పూనుకున్నదని విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా స్టీల్ ప్లాంట్‌ను నష్టాల్లోకి వెళ్లేలా చేశారని విమర్శించారు. ప్రైవేటీకరణ చేసేందుకు ముందుగా విశాఖ స్టీల్ ప్లాంట్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సుమారు 2వేల మందిని తొలగించారని, మిగిలిన వారిని తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు వై.మన్మధరావు, వి.దాలినాయుడు, టి.జీవ, బి.మోహన్ రావు, బివి రమణ, గొర్లి వెంకటరమణ, ఎం.వెంకటరమణ, సంచాన ఉమామహేశ్వరరావు, రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, సాయి శ్రీనివాస్, టి. గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ సభ్యులు

నేటి నుంచి గ్రామ స్థాయిలో యోగాంధ్ర పోటీలు

ప్రజాశక్తి -పార్వతీపురం

యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా గ్రామ స్థాయిలో పెద్ద ఎత్తున వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో యోగ పోటీలు ఉంటాయని, ఇందులో విజేతలను రాష్ట్ర స్థాయికి పంపిస్తామన్నారు. 10 నుండి 19 ఏళ్ల మధ్య వయస్సు గల వారికి, 20 నుండి 35 మధ్య వయస్సు గల వారికి, 35 సంవత్సరాలు పైబడిన వారికి మూడు కేటగిరీలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. వివిధ యోగాసనాల పోటీలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ మేరకు యోగా చేయవచ్చని పిలుపునిచ్చారు. డిఇఒ ఈ పోటీలను సమన్వయం చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో పెద్ద ఎత్తున యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామని అన్నారు. రోజు వారిగా వివిధ ప్రాంతాల్లో యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొన వచ్చని ఆమె పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని జిల్లా నోడల్ అధికారిగా నియమించామన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగే కార్యక్రమాలను సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ జరిగే కార్యక్రమాలను సంబంధించిన పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు.

యోగా శిక్షకులను నమోదు చేయాలి

గ్రామ, మండల స్థాయిలో యోగా శిక్షకులను నమోదు చేయాలని మండల ఎంపిడిఒలను జెసి ఆదేశించారు. శిక్షకుల వివరాలు సంబంధిత పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు.

ప్రజలు యోగాంధ్రలో పెద్ద ఎత్తున పాల్గొనాలి

యోగాంధ్రను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రజల భాగస్వామ్యం ఉండాలని జెసి అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర వెబ్ సైట్ ద్వారా పెద్ద ఎత్తున నమోదు కావాలని పిలుపునిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, ఇతర జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, ఎంఇఒలు పాల్గొన్నారు.

విస్తతంగా యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలు

యోగా శిక్షణలో పాల్గొన్న సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, అధికారులు

యోగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఐటిడిఎ పిఒ

30న తోటపల్లిలో యోగాంధ్ర

గరుగుబిల్లి : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 30న తోటపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో యోగా కార్యక్రమం నిర్వహించే ప్రదేశాన్ని సందర్శించారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్నామని ఆయన చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో నిర్వహణలో భాగంగా తోటపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద యోగ కార్యక్రమం జరుగుతుందన్నారు. జూన్ 5న సీతంపేట ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్ లోనూ, 12న మక్కువ మండలం వెంగళరాయ సాగర్ వద్ద గల ఏనుగు కొండ దగ్గర యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, తదితర అధికారులు పాల్గొన్నారు.

జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జిల్లా నుండి ప్రతి ఒక్కరూ పాల్గొనే విధంగా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు సీతంపేట, ఐటిడిఏ సమావేశ మందిరంలోనూ, పార్వతీపురం, పాలకొండ, సాలూరు పురపాలక సంఘాల పరిధిలో యోగా శిక్షకులు, ప్రజలతో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. పార్వతీపురం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద గల బంధం వారి వీధిలో యోగ గురువు మోహన్ ఆధ్వర్యాన, సాలూరు పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద సాలూరు యోగా సెంటర్ ఆధ్వర్యంలో పురపాలక సంఘం యోగా కార్యక్రమం నిర్వహించింది. పాలకొండలో రుషి యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. యోగాసనాలు, యోగా వలన కలుగు లాభాలను ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కమిషనర్లు, యోగా సంఘం ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యపై 28న ధర్నా

ప్రజాశక్తి -పాలకొండ

తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగునీరందించాలని కోరుతూ ఈనెల 28న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు పిలుపునిచ్చారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని తుమరాడలో రైతు సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బి.లక్ష్మణనాయుడు, ఆయకట్టు రైతు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ తోటపల్లి ఎడమ కాలువ ఆయకట్టు గ్రామాలకు ఖరీఫ్ సీజన్‌కు సాగునీరందడం లేదన్నారు. ప్రస్తుతం అవసరం లేకపోయినా నీరు రావడం వల్ల నువ్వులు, ఇతర అపరాలు, ఉపాధి హామీ పనులకు ఆటంగా ఏర్పడిందని అన్నారు. అవసరమైనప్పుడు నీరు రాకుండా అనవసరమైనప్పుడు నీరు వస్తుందని రైతులు నాయకుల వద్ద వాపోయారు. అలాగే ఒక షట్టర్ మధ్యలో ఆగిపోయిందని, మరో షట్టర్ పూర్తిగా పడకపోవడం వల్ల నీరు ప్రవహిస్తుందని, తూములు కూడా సక్రమంగా లేవన్నారు. ప్రస్తుతం దీనిపై అధికారులు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బంటు దాసు మాట్లాడుతూ షట్టర్ ద్వారా వృథాగా పోతున్న నీరు తక్షణమే నియంత్రించకపోతే రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. తక్షణమే రైతాంగానికి సాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 10 గంటలకు పాలకొండ కోట దుర్గగుడి వద్దకు రైతులు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో నాయకులు గుమ్మడి పాపి నాయుడు, సన్యాసి నాయుడు, పి.శ్రీనివాసరావు, ఎం.సీతారాం, జి. కుమార్, బొత్స అప్పలనాయుడు, ఆర్.గణపతి, నాగరాజు, బి.సత్తిబాబు, కె.రాము, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు

ఏనుగుల దాడిలో మామిడితోట ధ్వంసం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్‌కు ఆనుకొని ఉన్న మామిడితోటలో సోమవారం ఏనుగులు ప్రవేశించి ధ్వంసం చేశాయి. 15 ఏళ్ల క్రితం ఎస్‌సి కార్పొరేషన్ సహకారంతో ప్రభుత్వం ఇచ్చిన భూమిలో మామిడి తోట వేసుకొని జీవనోపాధి పొందుతున్న వెంకయ్య కుటుంబం రెండు, మూడురోజుల్లో చేతి కొచ్చిన పంట నష్టపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడు జట్టు సహకారంతో మామిడి తోట చుట్టూ కంచె వేయడం వల్ల పంట దొంగల పాలు కాలేదని, అయితే ఏనుగుల రూపంలో పంటంతా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట నష్టపోవడం మాత్రమే కాకుండా కొన్ని చెట్లను కూకటి వేళ్లతో సహా పెకలించాయన్నారు. మరి కొన్ని చెట్ల కొమ్మలు విరిసివేయడం, పండ్లు చెట్ల నుంచి దులిపి వేయడం వల్ల సుమారు రూ.50 వేల వరకు పంట నష్టం జరిగిందిని రైతు వాపోతున్నారు. రాత్రి పూట ఏనుగుల సంచారం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ట్రస్ట్ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఏనుగులు పాలకొండ -పార్వతీపురం రహదారిపై సంచరించడంతో వాహనదారులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక మంది రైతులు ఏనుగులు వల్ల ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని బతుకుతున్నారు. ఇప్పటికైనా ఏనుగులను తరలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాలకొండ- పార్వతీపురం రోడ్డుపై సంచరిస్తున్న ఏనుగులు, నిలిచిపోయిన వాహనాలు

ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పర్యాటకాభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కును పరిశీలించారు. పార్కులో గిరి గ్రామదర్శిని, వాటర్ స్పోర్ట్స్ వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా గిరి గ్రామదర్శిని ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా గిరి గ్రామాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గిరి గ్రామం ఏర్పాటుపై అధికారులకు పలు సూచనలు చేశారు. అదే విధంగా పిల్లలు, యువతను ఆకర్షించేలా వాటర్ స్పోర్ట్స్‌లు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వాటర్ స్పోర్ట్స్‌లో స్లైడ్స్, స్విమ్మింగ్ పూల్, రెయిన్ డాన్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, ఇఇ రమాదేవి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న ఎండియు ఆపరేటర్లు

ఎండియు వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేయాలి

ప్రజాశక్తి -కురుపాం

ఎండియు వాహనాల ద్వారా ప్రజలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం ఆధ్వర్యంలో ఎండియు ఆపరేటర్లు సోమవారం జియ్యమ్మవలస తహశీల్దార్ చిన్నారావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఎండియు వాహనాలను ఆపివేస్తే గిరిజన గ్రామాల ప్రజలు డిపోల వద్దకు సుమారుగా 5 నుంచి 6 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తాదని, కావున ప్రభుత్వం ఈ వాహనాలను నిలిపివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఎండియు వాహనాల ద్వారా ప్రజలకు బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండియు ఆపరేటర్లు దోనక కనయ్య, దొనక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఒకటో గ్రామ సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి కె.కొండలరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి పన్నుల బకాయిలు వసూలు చేయాలన్నారు. స్వర్ణ పంచాయితీ ఆధార్ సీడింగ్ త్వరగా పూర్తి చేయాలన్నారు. యోగాంధ్ర చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు సమీక్షించారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ రాంప్రసాద్, ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపిడిఒ బి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యాధులపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో అడపా దడప కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించాలని, ఎవరికైనా జ్వరాలు ఉన్నట్లయితే వారి నుంచి రక్తపూతలు సేకరించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్ధన్‌రావు, శాంతకుమారి, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం, నాటు సారా ధ్వంసం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 72 కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యం 1067 బాటిళ్లను ధ్వంసం చేసినట్లు సిఐ డి పద్మావతి తెలిపారు. రెండు కేసుల్లో పట్టుబడ్డ నాటు సారాను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

తల్లీ కొడుకు అదృశ్యం

ప్రజాశక్తి -సీతానగరం

ఇంట్లో తగాదాపడి తల్లి కొడుకును తీసుకొని ఇంట్లోంచి నుంచి వెళ్లిపోయిన సంఘటన ఇటీవల చోటు చేసుకుంది. ఈ సంఘటనపై ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంటిపేటకు చెందిన సారిపల్లి జ్యోతి ఈనెల 23న తన తల్లి కోట సత్యవతితో గొడవపడి కుమారుడు సంజయ్ తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబీకులు వెతుకుతున్నా కనబడకపోవడంతో సోమవారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎవరికైనా వీరి ఆచూకీ లభిస్తే 9121109457 కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

అడుగంటిన వెంకమ్మ సాగరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకమపేట పంచాయతీ పరిధిలో గల వెంకమ్మ సాగరం పూర్తిగా ఎండిపోయింది. నిన్నటి వరకు నీటితో కళకళాడిన వెంకమ్మ సాగరంలో ప్రస్తుతం చుక్కనీరు లేక ఎడారిని తలపిస్తుంది. సుమారు 123 ఎకరాల విస్తీర్ణం గల ఈ సాగరం వందలాది ఎకరాలకు ఆయకట్టుకు ఆయువుపట్టుగా ఉంది. ఎండల తీవ్రతకు వెంకటమ్మ సాగరం అడుగంటి పోయింది.



నీరులేక ఎండిపోయిన వెంకమ్మ సాగరం

అనుకున్నదొక్కటి... అయ్యిందొక్కటి

- మంత్రి వైఖరిపై అసంతృప్తి
- ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో జనాలకు కష్టాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రతిష్టాత్మకమైన సాలూరు గ్రామదేవత పండగ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అనుకున్నదొక్కటి, అయ్యిందొక్కటి అన్న చందంగా తయారైంది. పండగ నిర్వహణలో అన్నీ తానై నడిపించడం, తన కనుసన్నల్లోనే జరగాలని ఆశించడం వల్ల ఆమె వ్యక్తిగత ప్రతిష్టతో పాటు పార్టీ ప్రతిష్ట కూడా మసకబారిందనే చర్చ ప్రజల్లో నడుస్తోంది. గ్రామదేవత పండగ అంటే గ్రామంలోని పెద్దల సమిష్టి నిర్ణయం మేరకు నిర్వహించాల్సిన కార్యక్రమం. రాజకీయాలకు, కులాలకు అతీతంగా అందర్నీ కలుపుకొని ముందుకు సాగిపోయేలా చూడాల్సిన బాధ్యత ఆమెపై ఉంది. గతంలో శ్యామలాంబ పండగ నిర్వహించిన సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న రాజన్నదొర ఉత్సవ కమిటీ ఏర్పాటులో పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు భాగస్వామ్యం వుండేలా చూశారు. అయితే ఇప్పుడు మాత్రం మంత్రి సంధ్యారాణి తన వల్లే పండగ జరుగుతోందనే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఉత్సవ కమిటీ ఏర్పాటులో జోక్యం చేసుకుని తాను సూచించిన వ్యక్తినే కమిటీ చైర్మన్ చేయాలని నిర్ణయించారు. పండుగ నిర్వహణపై ఏ మాత్రం అనుభవం లేని పార్టీకి చెందిన యువనాయకుడ్ని ఉత్సవ కమిటీ చైర్మన్ చేసినప్పుడే టిడిపి నాయకులు, కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు కమిటీలో ప్రాధాన్యత లేకుండా చేయడంతో అనేకమంది ఆశ్చర్యానికి లోనయ్యారు. పండగకు సంబంధించిన ప్రతి ఘట్టంలోనూ తన పాత్ర వుండేలా చూసుకున్నారనే ప్రచారం జరుగుతోంది.

సాంప్రదాయాలకు, ఆచారాలకు తిలోదకాలు

స్థానిక ఆచారాలు, సంప్రదాయాలకు పండగ నిర్వహణపై పట్టణానికి చెందిన చాలా మంది పెద్దలకు విశేష అనుభవం ఉంది. అలాంటి పెద్దల పర్యవేక్షణలో నిర్వహించి వుంటే నిర్వహణలో గానీ, విద్యుత్ సరఫరాలో గానీ ప్రజలకు ఇబ్బందులు తలెత్తేవి కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు నెలల ముందు నుంచే పండుగ పనులు ప్రారంభమయ్యాయి. సిరిమాను రథం తయారీ కోసం చెట్టును నరికి సిద్ధం చేశారు. అంతవరకు బాగానే ఉంది. రథం తయారు కాకముందే మానును ఊరంతా ఊరేగించడం సరికొత్త సాంప్రదాయానికి తెరలేపినట్లయింది. ప్రధాన ఘట్టం సిరిమానోత్సవం సాయంత్రం 4.05 గంటలకు ప్రారంభం కావాల్సి వున్నప్పటికీ మంత్రి సంధ్యారాణి వచ్చేంత వరకు నిలిపివేయడంపైనా ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రిగా ఆమె సిరిమానోత్సవం తిలకించవచ్చు కానీ నాలుగు వాహనాల కాన్వాయ్‌తో వేలాదిమంది జనం మధ్య నుంచి టాప్ లేని కారులో నేరుగా సిరిమాను రథం వద్దకు చేరడం వల్ల అటు భద్రతా సిబ్బంది, ఇటు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారనే వాదనలు వినిపిస్తున్నాయి.

సిరిమాను ప్రారంభించేందుకు ఓపెన్ జీపులో అభివాదం చేసుకుంటూ వస్తున్న మంత్రి (ఫైల్)

ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో జనాలకు కష్టాలు

పండగ నిర్వహణపై ఉత్సవ కమిటీకి గానీ, మంత్రి సంధ్యారాణికి గానీ ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో తాము ఇబ్బందులు పడాల్సి వచ్చిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండుగ నిర్వహణపై అవగాహన ఉన్న పలు వీధుల పెద్దల సలహాలు, సూచనలు తీసుకోకపోవడం వల్ల పండగకు హాజరైన అతిథులు అసంతృప్తితో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిరంతర విద్యుత్ సరఫరా కోసం సంబంధిత శాఖ అధికారులను అనుక్షణం అప్రమత్తం చేయడం, పండగ మూడు రోజుల్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరఫరాలో ఆటంకం లేకుండా చేయడంపై దృష్టి సారించలేదనే చర్చ జరుగుతోంది. 15ఏళ్ల క్రితం జరిగిన పండగ సమయంలోనూ విద్యుత్ సమస్యలు తలెత్తాయి. అప్పటి కన్నా పట్టణ జనాభా పెరిగింది. గృహాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. పెరిగిన ఆవాసాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలనే ప్రణాళిక ట్రాన్స్‌కో అధికారుల్లో కొరవడింది.

మంత్రి తీరుపై అసంతృప్తి

శ్యామలాంబ పండుగ నిర్వహణ ద్వారా తన వ్యక్తిగత ఇమేజ్‌తో పాటు పార్టీ ఇమేజ్ అమాంతం పెరిగిపోతుందని మంత్రి సంధ్యారాణి గట్టిగా నమ్మారు. పండగ నిర్వహించిన తీరుతో పాటు విద్యుత్ సరఫరాలో ఎదురైన ఇబ్బందుల వల్ల పలు వీధులకు చెందిన జనాలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేయడంతో మంత్రి అంచనాలు తలకిందులయ్యాయి. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తల్లోనూ ఆమె తీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పండగ నిర్వహణలో ఉత్సవ కమిటీ విఫలం

సాలూరులోని శ్యామలాంబ పండగ నిర్వహణలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నియమించిన ఉత్సవ కమిటీ ఘోరంగా విఫలమయిందని జనసేన నాయకులు రేగు మహేష్, రిపబ్లికన్ నాయకులు గొంప ప్రకాశరావు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్‌లో జెసి ఎస్ఎస్ శోబికకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామలాంబ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో ఉందని, ఆ శాఖ అధికారులే ఉత్సవాన్ని నిర్వహించాల్సి ఉందన్నారు. మంత్రి నియమించిన అనధికార కమిటీ పండగ పేరుతో పట్టణం ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిందని తెలిపారు. దూరప్రాంతాల నుంచి పండగకు వచ్చిన భక్తుల నుంచి కూడా చందాలు వసూలు చేశారని ఆరోపించారు. కమిటీ ఎంత వసూలు చేసిందో, ఎంత ఖర్చు చేసిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆలయంలో ఉండీ ఆదాయం కూడా దేవాదాయ శాఖ అధికారులు కమిటీ సభ్యుల పర్యవేక్షణలో లెక్కించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. పండుగ సాంప్రదాయాలు, ఆచారాలకు విరుద్ధంగా జరిగిందని, సిరిమానోత్సవం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా మంత్రి సంధ్యారాణి రాలేదని ఆరు గంటల వరకు వేచి వుండడం దారుణమని అన్నారు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయమైనప్పుడు ప్రభుత్వం నిర్వహించకుండా అనధికార కమిటీతో కోట్లు వసూలు చేసి పండుగ నిర్వహించడంపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు నివృత్తి చేయాలని, లెక్కలపై విచారణ జరిపించాలని రేగు మహేష్, గొంప ప్రకాశరావు డిమాండ్ చేశారు.

వసూళ్ల లెక్కలపై విచారణ చేపట్టండి
కలెక్టర్‌కు జనసేన, ఆర్‌పిఐ ఫిర్యాదు

నిర్లక్ష్యానికి నెలవు.. నూలుగెడ్డ మినీ రిజర్వాయర్

ప్రజాశక్తి - కురుపాం

సుమార్ 211 ఎకరాలకు నీరు అందాల్సి ఉన్న నూలుగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్లక్ష్యానికి గురవ్వడంతో రైతుల పొలాలకు నీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత 20 ఏళ్ల క్రితం కురుపాం గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్సియల్ పాఠశాల వెనుక భాగంలో ఉన్న నూలుగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మించారు. ఈ రిజర్వాయర్ చాకలవీధి వెనుభాగం నుంచి ప్రవహించి, రెల్లివీధి నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలో ఎదురొచ్చి అక్కడ చెక్వాల్ ద్వారా కొంత నీరు ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న పొలాలకు అలాగే కస్పాగదబవలస, పాత కురుపాం పొలాలకు సుమారు 4 చెక్ డ్యాంల ద్వారా 211 ఎకరాలకు నీరందించాల్సి ఉండగా గత 15 ఏళ్లుగా కనీసం ఎటువంటి మరమ్మతులు చేయకపోవడం, పూడికతీయక పోవడంతో రైతులకు సక్రమంగా నీరు అందడం లేదు.

పాడైపోయిన రిజర్వాయర్ తలుపులు

పాడైపోయని రిజర్వాయర్ తలుపులు

రిజర్వాయర్ తలుపులు మరమ్మతులకు గురవ్వడంతో వర్షకాలంలో వచ్చిన నీరంతా నిల్వ అవ్వకుండా వృధా పోవడంతో పొలాలకు నీరండం లేదు. నీరు నిల్వ ఉంటే సంబంధిత పొలాలకు సక్రమంగా నీరందేది. గత ప్రభుత్వంలో నిధులు లేకపోవడం అధికారులు పట్టించుకోకపోవడంతో రిజర్వాయర్ పరిస్థితి ఇలా తయారైంది. ఇప్పటికైన అధికారులు పట్టించుకుని రిజర్వాయర్ మరమ్మతులు చేస్తే పొలాలకు నీరందే అవకాశం ఉంది.

పట్టించుకునే నాధుడే కరువయ్యారు

గత ఐదేళ్లుగా రిజర్వాయర్ తలుపులు మరమ్మతులకు గురి కావడంతో ఎన్నిసార్లు తెలియజేసి పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో వచ్చిన నీరుతో మాత్రమే పంటలు పండిస్తున్నాం. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు తలుపులు మరమ్మతు చేసి, కాలువల్లో పూడిక తీసే తమ పొలాలకు సక్రమంగా నీరందుతుంది.

బి.పారసారదిరావు. అధ్యక్షులు,
నూలుగెడ నీటి వినియోగదారుల సంఘం.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారం చేయాలని, అమ్మవారి పండగ సమీపిస్తున్న వేళ తక్షణమే చర్యలు చేపట్టి ప్రతిరోజూ పరిశుభ్రమైన తాగునీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాల సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, సంచాన ఉమామహేశ్వరరావు, బివి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రస్తుతం కొళాయిల ద్వారా మంచినీరు వారానికి రెండుసార్లు మాత్రమే ఇస్తున్నారని, అది కూడా బురదతో కలుషితమైందని, ఆ నీరు తాగడానికి కూడా పనికి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న మున్సిపల్ యంత్రాంగం కనీస తాగేందుకు మంచినీరు కూడా ఇచ్చే పరిస్థితి లేకపోవడం విచారకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో శాశ్వత మంచినీటి పథకానికి రూ.63.63 కోట్లు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, ఫలితంగా మళ్లీ కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పార్వతీపురం పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించాలని, లేకుంటే ఈ సమస్యపై ఉద్యమిస్తామని హెచ్చరించారు..

జంఝావతి పూర్తి కావాలని

కృష్ణా నదిలో జలహారతి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని రాజ్యలక్ష్మీపురం వద్ద గల జంఝావతి ప్రాజెక్టు పూర్తి కావాలని కోరుతూ సోమవారం విజయవాడలోని కృష్ణా నదిలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, జంఝావతి సాధన సమితి కార్యాచరణ కన్వీనర్ మరిశర్ల మాలతి కష్ణమూర్తి జల హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా పూర్తిస్థాయి పనులకు నోచుకోని జంఝావతి ప్రాజెక్టు పూర్తి కావాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణా నదిలో గంగమ్మ తల్లికి పుష్పాభిషేకంతో పాటు జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమం ఈనెల 30న జంఝావతి నదిలో చేపట్టబోయే జలహారతి కార్యక్రమానికి సంఘీభావంగా చేపట్టామన్నారు. అలాగే ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు, సభ్యులు ఈ నెల 30న ఉత్తరాంధ్రలోని వారికి అందుబాటులో ఉన్న జలాశయాల్లో జలహారతి కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. గత ఐదు దశాబ్దాలుగా పూర్తికాని జంఝావతి ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

సమస్య పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడుకూరు గ్రామం రామాలయం వీధిలో లో వోల్టేజ్ విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఇఇ విష్ణుమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న గ్రామంలో లో వోల్టేజ్ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో ఆయన స్పందించి సమస్య పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.

రెండు బైకులు ఢీకొని గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం నుంచి ఆగంగూడకు వెళ్తున్న బిడ్డిక నీలకంఠేశ్వరరావు నీలకంఠాపురం నుంచి గుమ్మలక్ష్మీపురం మీదుగా బత్తిలి వెళ్తున్న శిఖరేశ్వరరావు కురుపాం మండలం తుమ్మికి మానుగూడ వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆగంగూడ కు చెందిన బిడ్డిక నీలకంఠేశ్వరరావు కాలు విరిగిపోయింది. గాయపడిన వారిని వైద్యం కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నిష్పక్షపాతంగా లక్షింపేట కేసు విచారణ చేపట్టాలి

కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలోనే సంచలనం రేకెత్తించిన లక్షింపేట దళితుల ఊచకోత కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఉత్తరాంధ్ర దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేసారు. కేసు విచారణ సందర్భంగా పక్షపాత వైఖరి చూపిస్తున్న లక్షింపేట ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిని బదిలీ చేయాలని కోరారు. సాక్ష్యులు కోరుకున్నట్లుగా సీనియర్ న్యాయవాది నవాబ్ హుస్సేన్ అక్బర్ ను ఎస్.పి.పిగా నియమించాలని డిమాండ్ చేసారు. ఈమేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ఉత్తరాంధ్ర దళిత సంఘాల జెఎసి ఆధ్వర్యంలో దళితులు ధర్నా నిర్వహించారు. లక్షింపేట దళిత బాధితులతో పాటు జెఎసి నాయకులు పాల్గొన్నారు. లక్షింపేట మారణకాండకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని, 13 ఏళ్లగా నిరీక్షిస్తున్న లక్షింపేట దళిత బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేసారు. నెత్తురు తడిచిన నేలకు న్యాయం చేయాలని కోరారు. కోర్టు హాలులోనే బహిరంగంగా సాక్షులు, ముద్దాయిల ముందే పక్షపాత పూరితంగా లక్షింపేట ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు చేస్తుండడాన్ని వారు తప్పుపట్టారు. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సాక్షుల పట్ల పక్షపాతం చూపిస్తున్నందున ఆయనను తక్షణం బదిలీ చేసి హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. నిజాయితీగా కలిగిన,నిష్పక్షపాతంగా విచారించే న్యాయమూర్తిని నియమించాలని కోరారు. ఇప్పటికే పలువురు సాక్ష్యులు మృతి చెందారని, మరికొందరు కోర్టుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

అనంతరం కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను కలుసుకుని లక్షింపేట బాధితుల తరపున వినతిపత్రాన్ని అందజేసారు. కార్యక్రమంలో దళిత సంఘాల జెఎసి నాయకులు డాక్టర్ కంత వేణు, తైక్వాండో శ్రీను, ఉదయ్ భాస్కర్, నుకతుట బాబురావు, చిత్ర గంగులు, జజ్జన గురుమూర్తి, కెల్ల బీమారావు, ముంజేటి కృష్ణ, సాకేటి నాగరాజు, బొంగ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సులాబ్‌కాంప్లెక్స్ కార్మికులు, సిఐటియు నాయకులు

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీలో ఉన్న ఏడు సులాబ్ కాంప్లెక్స్‌ల్లో పనిచేస్తున్న కార్మికులకు 18నెలలుగా బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, బివి రమణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం గ్రీవెన్సులో అధికారులకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సులాబ్ కాంప్లెక్స్‌ల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కూడా జీతాలు చెల్లించే పరిస్థితిలో అధికారులు లేరని విమర్శించారు. కోట్ల రూపాయలు పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు సులాబ్ కాంప్లెక్స్ లో పనిచేస్తున్న కార్మికులకు గత 18 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు? ఇది అధికారుల నిర్లక్ష్యం తప్ప ఇంకోటి కాదని అన్నారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కార్మికులు బి.సుధా, జోజమ్మ, ఎన్.హరి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ వద్ద నిందితులను హాజరైన పర్చిన ఎక్సైజ్ అధికారులు

నాటు సారా కేసులో 18 మంది అరెస్టు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, జియ్యమ్మవలస మండలాల పరిధిలోని గతంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించగా నాటుసారా కేసుల్లో పట్టుబడిన 18 మందితోపాటు, నాటుసారా తయారీకి అవసవైన ముడిసరుకులు విక్రయిస్తున్న ముగ్గురు వ్యాపారులను కురుపాం, జియ్యమ్మవలస మండలాల తహసీల్దార్ల ముందు సోమవారం ఎక్సైజ్ అధికారులు హాజరుపరిచారు. ఏడాదిలో మళ్లీ నాటుసారా కేసులో పట్టుబడితే రూ.2 లక్షలు జరిమానా విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్లు రమణమ్మ, ఎస్.చిన్నారావు, ఎక్సైజ్ సిఐ పి. శ్రీనివాసరావు, ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

నిబంధనల కొర్రీలతో తప్పని తిప్పలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీ పురం

రాష్ట్ర ప్రభుత్వం అందజేసే బియ్యం కార్డుల మంజూరునకు మార్పులు, చేర్పులకు ప్రస్తుత ప్రభుత్వం విధించిన నిబంధనల కొర్రీలను తక్షణమే తొలగించాలని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ కో - అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ బియ్యం కార్డు కావాలంటే పెళ్లి కార్డు, వివాహ ధ్రువీకరణ పత్రం, తప్పనిసరి అంటూ సచివాలయం సిబ్బంది అడగడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో ముఖ్యంగా పేదల్లో వివాహ ధ్రువీకరణ పత్రాలు ఉండవని, నిరక్షరాస్యత, అవగాహన లేమితో సమస్యలు మరింత జటిలంగా ఉన్నాయని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెళ్ళై, పిల్లలు కని, ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోతూ వేర్వేరు కుటుంబాలుగా బతుకుదలచుకుంటూ, కొత్త రైస్ కార్డుల కోసం సభ్యుల తొలగింపు, జోడింపు వంటి సమస్యలతో దరఖాస్తు చేసుకుంటున్న వారే ఎక్కువ ఉన్నారని ఆయన తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం, అధికారులు విధించిన నిబంధనలతో తిప్పలు తప్పడం లేదని ఆయన పేర్కొన్నారు. దీనికి తోడు 'సర్వర్' మొరాయింపుతో రోజుల తరబడి పిల్లాపాపలతో సంబంధిత సచివాలయాల చుట్టూ తిరుగక తప్పడం లేదని వాపోయారు. ఈ సమస్యల దృష్ట్యా, సంబంధిత ప్రభుత్వ అధికారులు ప్రస్తుత నిబంధనలను సవరిస్తూ నిర్దిష్టమైన ఆదేశాలను జారీ చేస్తూ సత్వరమే బియ్యం కార్డుదారుల సమస్యలకు పరిష్కరించాలని చిన్నారావు కోరారు.

కాకాని అరెస్టు అన్యాయం : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్ష సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే కూటమి ప్రభుత్వం మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశారని విమర్శించారు. వ్యక్తిగత పనులు కోసం కేరళ వెళ్లిన గోవర్ధన్ రెడ్డిని అన్యాయంగా అరెస్టు చేశారని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని విమర్శించారు.